# ఝార్ఖండ్ : ఆదివాసులపై పోలీసు కాల్పులు - ఐదుగురి హత్య

**2016** అక్టోబర్ 1 వేకువఝామున, ఆజాదీబచావ్ ఆందోలన్ నాయకత్వాన తమ భూముల బలవంతపు సేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఆదివాసులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో నలుగురు ఆదివాసులు అక్కడికక్కడే మృతిచెందగా, అనేకమంది ఈ కాల్పులలో గాయపడ్డారు. హజారీబాగ్ జిల్లాలోని బర్కాగావ్ ప్రాంతంలో 'విస్థాపన్ విరోధి నవ్ నిర్మాణ్ మోర్చా, ఝార్ఖండ్'లో భాగమైన ఆజాదీ బచావ్ ఆందోళన్ రైతాంగాన్ని సమీకరించి, సంఘటితపరుస్తోంది.

2004 అక్టోబర్ 11న, 16 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వ సామర్థ్యం వున్నదిగా పేర్కొంటున్న హజారీబాగ్ జిల్లాలోని పాక్రి బరావధి బొగ్గుబ్లాక్‌ను భారత ప్రభుత్వం ఎన్‌టిపిసికి కేటాయించింది. ఈ భూమి మొత్తం విస్తీర్ణం 1200 ఎకరాలు. కాగా ఇది 2500 ఎకరాల అటవీ ప్రాంతంలోని 40 గ్రామాల పరిధిలో విస్తరించి వుంది.

ఈ కేటాయింపు పరిధిలో వున్న భూములకు చెందిన రైతాంగం నుండి మొదట వ్యతిరేకత ప్రారంభమైంది. ఈ ప్రాంతమంతా బహుళపంటలు పండే సారవంతమైన భూములున్న ప్రాంతం. ఈ ప్రాంత రైతుల జీవనం యావత్తు ఈ భూములపై ఆధారపడి వుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భూములను ఇవ్వటానికి రైతాంగం సిద్ధంగా లేరు.

2007 జనవరి 6న, ఉదయం 11 గంటలకు ఈ సమస్యపై ప్రజాభిప్రాయ సేకరణ వుంటుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ప్రభుత్వ అధికార యంత్రాంగం దొంగచాటుగా ప్రజాభిప్రాయ సేకరణ తంతును అంతకు ముందురోజు రాత్రి 11 గంటలకే ముగించింది. రైతులు ఈ విషయాన్ని ఏదోలా తెలుసుకొని, ఆ ప్రాంతానికి చేరుకొని ప్రతిపాదిత భూసేకరణ పట్ల తమ తీవ్ర వ్యతిరేకతను తెలియచేశారు.

ఈ వ్యతిరేకత వెలిబుచ్చినందుకుగాను కొందరు రైతులపై తప్పుడు కేసులు బనాయించారు.

ప్రభుత్వం దొంగచాటుగా నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో ప్రజలంతా తమ భూములను ఇవ్వటానికి సంసిద్ధంగా వున్నారని పచ్చి అబద్ధాన్ని ప్రకటించింది. భూముల సేకరణను వ్యతిరేకిస్తున్న రైతుల పట్ల వేధింపులు కొనసాగుతున్నాయి.

భూసేకరణ చట్టం - 2013 ప్రకారం, గ్రామ సభలలో 70 శాతం బాధిత ప్రజానీకం యొక్క ఆమోదం తప్పనిసరి అవసరంగా పేర్కొన్నారు. అటవీ హక్కుల చట్టం - 2016 అటవీ భూముల సేకరణకు నిర్దిష్ట షరతులను రూపొందించింది. కానీ ఎన్‌టిపిసి వీటిని ఏమాత్రం ఖాతరు చేయలేదు.

2016లో 3 వేల ఎకరాల అటవీభూమిని, 435 ఎకరాల రైతాంగ భూములను సేకరించటానికి నిర్ణయించి అటవీ ప్రాంతంలో బొగ్గుగనుల తవ్వకాలకు సిద్ధమైంది. రైతులు, స్థానిక నాయకత్వం బొగ్గుగనుల తవ్వక ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు. దీని కారణంగా రైతులకు, స్థానిక నాయకులకు రెండు నెలలు ఆపైగా కాలం జైలుశిక్ష విధించారు. వేధింపులకు తోడుగా ఈ కేసులు కూడా ఈనాటికీ కొనసాగుతున్నాయి.

2011 జూన్ 23న ఓ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. భారత ప్రభుత్వం ఎన్‌టిపిసికి కేటాయించిన ఛత్రిబారియతు బొగ్గు బ్లాక్‌ను రద్దు చేసింది. కానీ 2011 నవంబర్‌లో హజారీబాగ్ జిల్లా ప్రభుత్వ యంత్రాంగంపైన పేర్కొన్న ఛత్రిబారియాతు బొగ్గుబ్లాక్‌ను ఎన్‌టిపిసికి బదలాయించింది. గ్రామసభ పూర్తిగా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వుండటమేగాక, రైతులు తమ ప్రాణాలర్పించటానికైనా సిద్ధంగా వున్నారు గానీ, ఈ భూములను వదులుకునేందుకు మాత్రం సిద్ధంగా లేరు.

2016 అక్టోబర్ 1న తెల్లవారుఝామున 4 గం॥ నుండి 6.30 మధ్య జరిగిన పోలీసు కాల్పుల అనంతరం నాలుగు మృతదేహాలను అందజేశారు. అయితే ఇప్పటికీ మరో ముగ్గురు రైతులజాడ కానరావటంలేదు. లాఠీఛార్జీ, కాల్పులు సాగించిన తర్వాత పోలీసులు వెనువెంటనే గ్రామాలలోకి చొరబడి మహిళలు, వృద్ధులు, బాలలనే విచక్షణ లేకుండా ఇళ్ళలోని ప్రజలపై లాఠీఛార్జీ చేశారు. ఈ దాడుల్లో, పోలీసు బుల్లెట్ల గాయాల్లో మరో 50 మందిపైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయాలపాలైన అనేకమంది ఆస్పత్రికి వెళ్ళి చికిత్స చేయించుకోవటానికి సైతం - అరెస్టులు సాగిస్తారనే భయంలో - వెనుకాడుతున్నారు. వారంతా గ్రామ స్థాయిలో ప్రైవేటు వైద్యులవద్దే చికిత్స పొందుతున్నారు. ఆ ప్రాంతాన్నంతా 7 పటాలాల సాయుధ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ మరియు అర్ధసైనిక బలగాలు చుట్టుముట్టి వున్నారు. ఆ ప్రాంతమంతా 144 సెక్షను విధించి వున్నారు. ఆ ప్రాంతంలో ఏమి జరుగుతోందో బయటకు పూర్తిగా సమాచారం అందటంలేదు.

పోలీసు కాల్పులను, హత్యాకాండను, లాఠీఛార్జీని నిరసిస్తూ ఝార్ఖండ్‌లోని అనేక సంస్థలు, సంఘాలు ఆందోళనలు ప్రారంభించాయి. 6కుపైగా ఝార్ఖండ్ ముఖ్యమంత్రి దిష్టిబొమ్మలు రాష్ట్ర రాజధాని రాంచీ పట్టణం నడిబొడ్డులోనే తగులబెట్టారు. రాంచీలోని గవర్నర్ బంగ్లా ఎదుట మరియు హజారీబాగ్ జిల్లా కేంద్రంలో అనేక నిరసన ప్రదర్శనలు, జనసమీకరణతో సభలు, ధర్నాలు జరిగాయి. 2016 నవంబర్ 12, 13 తేదీలలో 'అజాదీ బచావ్ ఆందోళన్' నేతృత్వంలో 'సహజవనరులపై ప్రజల యాజమాన్యం' అంశంపై జాతీయస్థాయి సదస్సు నిర్వహించారు. సిపిఐ(ఎం-ఎల్) ఈ సదస్సులో ఒక క్రియాశీల భాగస్వామిగా వుంది.

ఝార్ఖండ్ మొత్తంమీద, వందకుపైగా పరిశ్రమలతో ప్రభుత్వం అవగాహనా ఒప్పందాలు (ఎంఒయు) చేసుకుంది.

ప్రతిచోటా ప్రభుత్వం ప్రజా నిరసనలను ఎదుర్కొంటోంది. ఝార్ఖండ్ రాష్ట్రం ఏర్పడిన ఈ 16 సం॥లలో 8 ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. అన్ని ప్రాంతీయ మరియు అన్ని జాతీయ పాలకవర్గ పార్టీలు ప్రభుత్వాధికారాన్ని చేపట్టాయి. ఇవి అన్నీ తమ ప్రభుత్వ పాలనా కాలంలో అనేక అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేశాయి. మీదుమిక్కిలి ఈ పార్టీలన్నీ ప్రజల, రైతాంగ, ఆదివాసుల రక్తంలో చేతులు ముంచాయి. అయితే, ప్రతిపక్షంలోనుండగా మాత్రం ఆయా పార్టీలన్నీ ప్రజలపట్ల తమ 'వినయాన్ని' ప్రదర్శిస్తుంటాయి.

విస్థాపనకు గురిచేయబడటం అనేది ఆదివాసుల, మూలవాసుల ఒక ప్రధాన సమస్యగా మారింది.

oooo